# బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాలకు భరోసా

## పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి, నవంబర్ 13 : బీఆర్ఎస్ తొమ్మిదిన్నరేండ్ల పాలనలోనే అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూరిందని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పరిగి మండలం మాదారం, గడిసింగాపూర్ గ్రామాల్లో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలనలో అట్టడుగు వర్గాలకు, ఇన్నేళ్లుగా సంక్షేమ ఫలాలు దక్కని వారికి సైతం మేలు చేకూరిం దన్నారు. గత పాలకులంతా వ్యవసాయాన్ని దండుగ అని చిత్రీకరించగా, సీఎం కేసీఆర్ పాలనలో 24 గంటలు నాణ్యమైన ఉచిత విద్యుత్‌తోపాటు పంటల పెట్టుబడి సాయం అందించి ఆదుకున్నారని చెప్పారు. సకాలంలో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచడం ద్వారా రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంటలు సాగు చేస్తున్నారని, వ్యవసాయ ఉత్పత్తులన్నింటినీ ప్రభుత్వమే కొనుగోలు చేస్తూ మరో భరోసా కల్పిం చిందని చెప్పారు. పేదింటి ఆడబిడ్డల వివాహానికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా ఆర్థిక సాయం, ఆసరా పింఛన్ల పెంపు, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీటి సరఫరా వంటివి ప్రజల జీవన విధానంలో ఎంతో మార్పు తీసుకువచ్చాయని అన్నారు. సీఎం కేసీఆర్ పాలనకు ఢోకా లేదనే భయంతోనే కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలంటూ ఎన్నికల హామీలిచ్చి నాటకాలాడుతుందని విమర్శించారు. కాంగ్రెస్ పథకాలను ప్రజలెవరూ పట్టించుకోవడం లేదని, ఏ మంచి పనైనా కేసీఆర్ ద్వారానే జరుగుతుందనే నమ్మకం ప్రజలలో ఉందన్నారు. పరిగిలో మరోసారి బీఆర్ఎస్ జెండా ఎగురవేసి సత్తా చాటుదామని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కరణం అరవిందరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, సీనియర్ నాయకులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్‌లు అశోక్‌వర్ధన్‌రెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.



మాదారం గ్రామంలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచార ర్యాలీ

# మంత్రి కేటీఆర్ రోడ్ షో సక్సెస్

## బీఆర్ఎస్ శ్రేణుల్లో రెట్టించిన ఉత్సాహం



మంత్రి కేటీఆర్ రోడ్‌షోకు హాజరైన ప్రజానీకం

పరిగి, నవంబర్ 13: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం పరిగి నియోజకవర్గంలోని కులకచర్లలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్ రోడ్ షో సక్సెస్ కావడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం పెంపొందింది. కులకచర్లలో కేటీఆర్ రోడ్‌షో సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు ఉంటుందని పేర్కొనగా ఒంటి గంట నుంచే రోడ్‌షో ప్రాంతానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రావడం ప్రారంభమైంది. పరిగి ఎమ్మెల్యే, బీఆర్ ఎస్ అభ్యర్థి కొప్పుల మహేశ్‌రెడ్డి నేతృత్వంలో నియోజకవర్గంలోని పరిగి, పూడూరు, దోమ, కులకచర్ల, చౌడాపూర్, మహ్మదాబాద్, గండీడ్ మండలాల నుంచి భారీ జన సమీ కరణ చేపట్టారు. ప్రతి గ్రామం, గిరిజన తండాల నుంచి పెద్ద సంఖ్యలో కేటీఆర్ రోడ్‌షోకు జనం తరలివచ్చారు. మహిళలు సైతం పెద్ద సంఖ్యలో రోడ్ షోకు హాజరవడం గమనార్హం. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన ప్రసంగంలో పలు అంశాలపై మాట్లాడినపుడు సభికుల నుంచి చక్కటి స్పందన కనిపించింది. ఒక దశలో సీఎం, సీఎం అంటూ నినా దాలు చేయగా సీఎం ఖమ్మంలో ఉన్నారంటూ కేటీఆర్ చెప్పారు. రోడ్‌షో సందర్భంగా కులకచర్ల పెద్ద గేటు చౌరస్తా జన సంద్రంగా మారింది. ఈ సందర్భంగా పరిగి కాంగ్రెస్ నాయకుడిపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు సభికుల నుంచి మద్దతు లభించింది. మరోవైపు రోడ్‌షో సందర్భంగా మాజీ డిప్యూటీ స్పీకర్ హరీశ్వర్‌రెడ్డి ఉద్యమ సమయంలో కేసీఆర్‌తో కలిసి నడిచిన మొదటి నాయకుడని చెప్పడంతో హర్షధ్వానాలు చేశారు. ఈసారి మహేశ్ రెడ్డిని గెలిపించండి గండీడ్, మహ్మదాబాద్ మండలాలను వికారాబాద్ జిల్లాలో కలిపి స్తానని చెప్పడంతో ఈ రెండు మండలాల పరిధిలో బీఆర్ఎస్ పార్టీకి మరింత మైలేజ్ రానుందని బీఆర్ఎస్ వర్గాలు పేర్కొన్నాయి. అలాగే సంవత్సరం లోపు కృష్ణా నీటిని తీసుకువచ్చి బీడు భూములు తడుపుతామని కేటీఆర్ హామీ ఇవ్వడంతో రైతాంగంలో చక్కటి స్పందన వచ్చింది. ఏదిఏమైనా కేటీఆర్ రోడ్‌షోతో పరిగి బీఆర్ఎస్‌కు మరింత ఊపు వచ్చిందని పేర్కొనవచ్చు.



మంత్రి కేటీఆర్ ప్రసంగాన్ని వింటున్న ప్రజలు

## బీఆర్ఎస్ హయాంలోనే తండాల అభివృద్ధి



గిర్కబాయితండాలో మాట్లాడుతున్న కరాటే రాజు

బొంరాస్‌పేట, నవంబర్ 13 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే గిరిజన తండాల అభివృద్ధి జరిగిందని బొంరాస్‌పేట మండల ఎన్నికల ఇన్‌చార్జ్ కరాటే రాజు అన్నారు. మండలంలోని గిర్కబాయితండాలో బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం కేసీఆర్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 500 జనాభా ఉన్న తండాలను గ్రామ పంచాయతీలుగా ప్రకటించి గిరిజనులకు పాలనా ధికారం కల్పించారని అన్నారు. బీఆర్ఎస్ మండలా ధ్యక్షుడు కోట్ల యాదగిరి, రైతుబంధు సమితి మండలా ధ్యక్షుడు మహేం దర్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో గిరిజనులు కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో తాలూకా సేవాలాల్ సంఘం అధ్యక్షుడు దేశ్యానాయక్, ఎంపీటీసీలు జగదీశ్, నారా యణరెడ్డి, బీఆర్ఎస్ తాలూకా, మండల యూత్ అధ్యక్షులు నరేశ్‌గౌడ్, మహేందర్, నాయకులు శ్యామలయ్యగౌడ్ పాల్గొన్నారు.

## 11 నామినేషన్ల తిరస్కరణ




నామినేషన్లను పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి విజయకుమారి, పరిశీలకుడు సుధాకర్

పరిగి, నవంబర్ 13 : పరిగి అసెంబ్లీ నియోజకవర్గంలో 26 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా 15 మంది అభ్యర్థుల నామినేషన్ పత్రాలు సక్రమంగా ఉండగా, 11 నామినేషన్‌లు తిరస్కరణకు గురైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి విజయకుమారి తెలిపారు. మారుతీకిరణ్ బూనేటి(భారతీయ జనతా పార్టీ), డాక్టర్ తమ్మన్నగారి రామ్మోహన్ రెడ్డి (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్), కె.మహేశ్‌రెడ్డి(భారత రాష్ట్ర సమితి), ఇ.ఆనందం(బహుజన సమాజ్ పార్టీ), శ్రీశైలం బాయికాని(సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి), భాస్కర్ బేగరి(తెలంగాణ రిపబ్లికన్ పార్టీ), మంగలి నరేశ్(ధర్మ సమాజ్ పార్టీ), మహ్మద్ సలీం(భారత చైతన్య యువజన పార్టీ), మహేశ్‌రెడ్డి బరెడ్డి(అలియెన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ), పత్లావత్ గట్యానాయక్(బహుజన్ ముక్తి పార్టీ), ముకుంద నాగే శ్వర్ (స్వతంత్ర), బోయిని రాఘవేంద్ర(స్వతంత్ర), దూదేకుల గౌస్ (స్వతంత్ర), బేరి రాంచందర్‌యాదవ్(స్వతంత్ర), జి.మల్లేశంగౌడ్(స్వతంత్ర) అభ్యర్థుల నామినేషన్‌లు సక్రమంగా ఉన్నట్లు రిటర్నింగ్ అధికారి పేర్కొన్నారు. తమ్మన్నగారి ఉమాదేవి, కుమ్మరిపల్లి లాలయ్య, కుమ్మరి నరేశ్, చింతలగారి వెంకటస్వామి, శ్రీశైలం గోద, అర్చన బూనేటి, మొల్గరి మహేశ్వరి, కొప్పు మల్లేశం, కటికె మహేందర్ కటికె, కె.మల్లేశ్, నెహ్రూ ముడావత్‌ల నామినేషన్‌లు తిరస్కరణకు గురైనట్లు రిటర్నింగ్ అధికారి తెలిపారు. నామినేషన్ల పరిశీలనలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి విజయకుమారి తోపాటు పరిశీలకుడు సుధాకర్, పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

### కొడంగల్‌లో నామినేషన్ తిరస్కరణ

కొడంగల్, నవంబర్ 13: కొడంగల్‌లో ఒకరి నామినేషన్ తిరస్కరణకు గురైంది. సోమవారం ఎన్నికల అధికారులు నామినేషన్ పత్రాలను పరిశీలించారు. కొడంగల్ పరిధిలో మొత్తం 16 మంది నామినేషన్లు వేశారు. ఇందులో కాకులారం శ్రీనివాస్ ఏ ఫాం, బీ ఫాం అందించని కారణంగా నామినేషన్‌ను తిరస్కరించినట్లు ఎన్నికల అధికారి డిప్యూటీ కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు

## కాంగ్రెస్ హామీలను ప్రజలు నమ్మడం లేదు

దౌల్తాబాద్, నవంబర్ 13: మండలంలోని ర్యాలగుట్ట తండాలో సోమవారం జడ్పీటీసీ కోట్ల మహిపాల్ బీఆర్ఎస్ అభ్యర్థి పట్నం నరేందర్ రెడ్డిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మోసపూరిత హామీలను ప్రజలు నమ్మ డం లేదన్నారు. కేసీఆర్ పాలనలో తెలంగాణలోని అన్ని వర్గాల వారు సం క్షేమ పథకాలను అందుకొని సుఖసంతోషాలతో జీవనం సాగిస్తున్నారని, ఇటువంటి భాగ్యాన్ని కోల్పోవద్దని తెలిపారు.

## జాతీయ స్థాయి వాలీబాల్‌కు ఎంపిక



కులకచర్ల, నవంబర్ 13: కులకచర్ల మండలంముజాహిద్‌పూర్ మాడల్ స్కూల్ విద్యార్థి జాతీయ స్థాయి వాలీబాల్ క్రీడలకు ఎంపికయ్యారు. ఈ నెల 11, 12 వ తేదీల్లో సిద్దిపేటలో జరిగిన అండర్ 19లో రాష్ట్ర స్థాయి వాలీబాల్ క్రీడల్లో రంగారెడ్డి జిల్లా బాలుర జట్టు మొదటి స్థానం సాధిం చింది. జాతీయ స్థాయి వాలీబాల్ క్రీడలకు కిరణ్‌కుమార్ ఎంపిక పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయుడు కృష్ణారెడ్డి విద్యార్థిని అభినందించారు.

## గుర్తు తెలియని శవం లభ్యం

వికారాబాద్, నవంబర్ 13: గుర్తు తెలియని శవం లభ్యమైనట్లు వికారాబాద్ పోలీసులు తెలిపారు. వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని శివారెడ్డిపేట సమీపంలోని ఓ బావిలో గుర్తు తెలియని శవం కనిపించిందని స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు శవాన్ని బావిలో నుండి బయటకు తీయించారు. ప్రమాద వశాత్తుబావిలో పడి ఉంటాడని పోలీసులు తెలిపారు. ఒంటిపై చొక్కా, ప్యాంట్ ఉందని, వయస్సు దాదాపుగా 35 సంవత్సరాలు ఉంటుందన్నారు. ఆచూకీ తెలిసిన వారు వికారాబాద్ పోలీసులకు సమాచారం అందివ్వాలని వికారాబాద్ సీఐ శ్రీను తెలిపారు.